అమలాపురం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఏడుగురితో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణం చేయించారు. దేవ రాజేంద్రప్రసాద్ (రాజోలు), గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం), దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం), బండారు సత్యానందరావు (కొత్తపేట), వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట), వాసంశెట్టి సుభాష్ (రామచంద్రపురం) ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేశారు. అనంతరం వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

శాసనసభలో కోనసీమ ఎమ్మెల్యేలు... దైవసాక్షిగా ప్రమాణం



దాట్ల సుబ్బరాజు
ముమ్మిడివరం



బండారు సత్యానందరావు
కొత్తపేట



వేగుళ్ల జోగేశ్వరరావు
మండపేట



అయితాబత్తుల ఆనందరావు
అమలాపురం



గిడ్డి సత్యనారాయణ
పి.గన్నవరం



దేవ వరప్రసాద్
రాజోలు



వాసంశెట్టి సుభాష్
రామచంద్రపురం



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

తాగునీరు కలుషితం కాకుండా
చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 21: తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రుతుపవనాలతో కురిసే వర్షాలతో తాగునీటి వనరులు కలుషితమైతే డయేరియా, కీటకజనిత వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్, పారిశుధ్య శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్, వైద్య-ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి వనరులతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచి సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించారు. డ్రైన్లలో పైపులైన్లు క్రాసింగ్ అయ్యేచోట ఎక్కడైనా లీకేజీలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. పైపులైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు.జూలై 1 నుంచి రెండు నెలల పాటు కేంద్ర ప్రభుత్వం డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తుందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, మున్సిపల్ కమిషనర్లు ఎస్.మనోహర్, బి.రాము, బి.శ్రీనివాస్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

స్వేచ్ఛాయుతంగా
సార్వత్రిక ఎన్నికలు

సహకరించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

అమలాపురం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బందితో కలెక్టర్ అధ్యక్షతన సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మౌలిక వసతులు తక్కువగా ఉండి సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వాటన్నింటినీ అధిగమించి ఎన్నికల క్రతువును విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎదురైన అనుభవాలు, సవాళ్లు, వాటిని అధిగమించడానికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేశామని వారు చెప్పారు. వీఆర్వో దగ్గర నుంచి ఆర్వో వరకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవతో వ్యవహరించి పారదర్శకంగా విధులు నిర్వర్తించారన్నారు. ఎంపీడీవోలు, ఉపాధ్యాయులు బాగా పని చేశారన్నారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ జిల్లాలో 1,644 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఆ మేరకు పోలీసు సిబ్బంది జిల్లాలో లేకపోవడంతో వివిధకంపెనీల నుంచి సిబ్బందిని ఎన్నికల విధులకు రప్పించామన్నారు. రేయింబవళ్లు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆర్వోలుగా, ఏఆర్వోలుగా విధులు నిర్వహించడంతో పాటు వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులను కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్ సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్‌ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, ఏఆర్ డీఎస్పీ విజయసారధి, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబులను సత్కరించారు.



ఏఆర్ డీఎస్పీ విజయసారథిని సన్మానిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్



బడుగువానిలంక వద్ద గోదావరి నదీ గర్భంలో కలిసిన ఈ భూములనే ఆన్‌లైన్ చేయడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు



భూ దాహం

బడుగువానిలంకలో భారీ భూ కుంభకోణానికి ప్రణాళిక

నదీగర్భంలో కలిసిపోయిన 33.4 ఎకరాలు కొట్టేసే ప్రయత్నాలు

ఆలమూరు తహసీల్దారు కార్యాలయం నుంచి కదులుతున్న పావులు

గుట్టుచప్పుడు కాకుండా ఫారం-8 జారీ

ఆలమూరు, జూన్ 21:

సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి.. కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. అయితే కొత్త నాయకులకు అవగాహన వచ్చేలోపే పాత ఫైల్స్ కదిపేసి దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని కొందరు అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇటువంటి ఘటనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలో వెలుగులోకి వచ్చింది. ఈ గ్రామంలో భారీ భూ కుంభకోణానికి ప్రణాళిక రచించారు. ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా 33.4 ఎకరాల భూమిని కాజేసేందుకు సిద్ధమయ్యారు. ఈ భూమిని ఆన్‌లైన్ చేయించాలని గత అధికార పార్టీ పెద్దలు రెండేళ్లుగా పావులు కదుపుతున్నారు. అయితే అప్పట్లో పని చేసిన ఇద్దరు తహసీల్దార్లు తమ వల్లకాదని చేతులెత్తేశారు. దాంతో ఈ వ్యవహారం నిలిచిపోయింది. ఎన్నికల ముందు బదిలీల్లో భాగంగా ఆలమూరుకు కొత్త తహసీల్దారు వచ్చారు. భూ దాహంతో ఉన్న సదరు 'పెద్దలు' పట్టువదలని విక్రమార్కుల్లా మళ్లీ కొత్త తహశీల్దారు వద్ద ఈ ఫైల్‌ను కదిపించారు. నదీ గర్భంలో కలిసిపోయిన 33.4 ఎకరాలను ఆన్‌లైన్ చేయడానికి తహసీల్దారు అనిల్‌కుమార్ నేతృత్వంలో రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ముందుగా ఈ నెల 11వ తేదీన గుట్టుచప్పుడు కాకుండా ఫారం-8 జారీ చేశారు. ఫారం-8 బడుగువానిలంకలోని బహిరంగ ప్రదేశంతో పాటు రెవెన్యూ, పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ఉండగా కేవలం కాగితాలకే పరిమితమైంది.

బాగోతం ఎలా జరిగింది....

అసలు ఈ భూమి ఎవరిదోనని తెలుసుకుంటే ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. పూర్వకాలం జమిందార్లకు సంబంధించిన సుమారు 60 ఎకరాల భూమి బడుగువానిలంక సర్వే నెం.1,2,3ల్లో వుంది. ఇందులో సుమారు 30 ఎకరాలు ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో పోయింది. మిగిలిన భూమి మాది అంటే మాదంటూ అనేక మంది నకిలీ దస్తావేజులు సృష్టించుకుని వారసులుగా వస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా భూ హక్కు కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అసలు ఈ భూమికి వారసులు ఎవరూ లేరు. ఒకవేళ ఉన్నా వాటి కోసం వచ్చే వారు కాదు. అయినప్పటికీ ఎవరి స్థాయిలో వాళ్లు ఈ భూమిని కొట్టేయడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తూనే వస్తున్నారు. ఇప్పటికే అనేకమంది తహసీల్దార్ల వద్దకు ఈ బేరం వచ్చినప్పటికీ ఎవరూ ధైర్యం చేయలేదు. చివరికి ప్రస్తుతం ఎన్నికల విధుల నిమిత్తం వచ్చిన తహశీల్దారు అనిల్‌కుమార్ వద్ద ఎట్టకేలకు డీల్ ఒకే చేసినట్టు తెలుస్తోంది. అన్నీ అనుకూలిస్తే మరికొద్ది రోజుల్లోనే ఈ 34 ఎకరాల భూమిని ఒకరి పేరున అధికారికంగా ఆన్‌లైన్‌లో కట్టబెట్టేయనున్నారు. ఇందుకు గాను రూ.లక్షలు చేతులు మారుతున్నట్టు సమాచారం.

భూమి అంతా నదీపాతంలోనే..

ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ప్రస్తుతం ఆ భూమి లేదు.. మొత్తమంతా పాతికేళ్ల క్రితమే గోదావరి కోతకు గురై నదీగర్భంలో కలిసిపోయింది. మరి ఎందుకు ఈభూమి కోసం పాకులాడడం అనుకుంటున్నారా..? అక్కడికే వస్తున్నాము. అసలు భూమంటూ ఉండే బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో అప్పులు తీసేసుకోవడం చాలా సులభతరం. ఈ ప్రాంతంలో నర్సరీలు అధికంగా ఉండడం వల్ల ఎకరానికి రూ.25లక్షల వరకు బ్యాంకు రుణం పొందే అవకాశం ఉంటుంది. గతంలో అనేక ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో చోటుచేసుకున్నాయి. అదే మాదిరిగా ఈభూమిని ఆన్‌లైన్ చేసుకుంటే బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకోవడమే కాదు. అప్పుడప్పుడు ప్రభుత్వం ఇసుక మేటలను తొలగించుకోవడానికి అనుమతిస్తూ ఉంటుంది. ఆ సమయంలో తమ భూమిలో ఇసుక మేటలు వేశాయని, వాటిని తొలగించుకుంటామంటూ అనుమతి తెచ్చుకుంటారు. వాస్తవానికి అక్కడ భూమి అనేది ఉండదు. అంతా ఇసుక మేటలే. ఇసుక అమ్ముకోవడం ద్వారా కూడా పెద్ద ఎత్తున సొమ్ము చేసుకునే అవకాశం ఉంటుంది.

సాగు భూములకే ఆన్‌లైన్ అవకాశం

భూమి ఎవరిది అనేది పక్కన పెడితే అసలు నదీపాతంలో ఉన్న భూములకు ఆన్‌లైన్ చేయకూడదు. సాగులో ఉన్న భూములనే ఆన్‌లైన్ చేసి రైతులకు భూ హక్కు కల్పించాలి. కానీ అలాంటి రూల్స్ ఏమీ ఇక్కడ పనిచేయట్లేదు. వాటిని పక్కన పెట్టి ఆన్‌లైన్ చేయడానికి తహసీల్దారు అనిల్‌కుమార్ పాత ప్రభుత్వ నాయకుల కనుసన్నల్లో గుట్టుచప్పుడు కాకుండా చేసేస్తున్నట్టు భావిస్తున్నారు.

భూ రికార్డుల్లో ఒకరి పేరున...
ఆన్‌లైన్ దరఖాస్తు మరొకరిపేరున

బడుగువానిలంకలోని సర్వే నెం.1, 2, 3ల్లో ఉన్న భూమి మూడు మండలాల సరిహద్దులో ఉంటుంది. ఆత్రేయపురం మండలం వద్దపర్రు, కడియం మండలం వీరవరం గ్రామాల సరిహద్దులో ఉంది. ఈ భూమిని ఇటీవల జరిగిన భూ రీ సర్వేలో గుర్తించి భూ రికార్డుల్లో ఉన్న రేమళ్ల కన్నయ్య పేరున నమోదు చేసి ఎల్‌పీఎం నెంబరు ఇచ్చారు. అయితే ఈ భూమి తనదని డి.నవీన్‌కుమార్ దరఖాస్తు చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

భూ హక్కుదారుల దరఖాస్తుతో ఫారం-8 జారీ
అనిల్‌కుమార్, తహసీల్దారు, ఆలమూరు

భూ హక్కుదారులు తమ భూమిని ఆన్‌లైన్ చేయమని మ్యూటేషన్ పెట్టుకున్నారు. దీంతో ఈ భూమిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరుతూ ఫారం-8 జారీ చేశాను. ఎవరైనా అభ్యంతరం చెప్తే తక్షణం నిలుపుల చేస్తాము.



శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని
జీవించాలి

మండపేట, జూన్ 21: నేటి యువకులు శ్రీరామచంద్రమూర్తిని ఆదర్శంగా తీసుకుని జీవనం సాగించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. మండపేటలోని సీతారామ కల్యాణ మండపంలో మూడు రోజులపాటు జరిగే ఆయన ప్రవచనాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై భక్తి శ్రద్ధలతో విన్నారు.

అంతర్వేదిలో ఘనంగా సప్తనదీ మహా జ్యేష్ఠాభిషేకం

...5లో

సర్వరోగ నివారిణి
యోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. యోగాసనాలు సర్వరోగ నివారిణిగా పని చేస్తాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి యోగా ఉపకరిస్తుందన్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఎన్నో యోగాతో ముడిపడి ఉన్నాయని పలువురు వివరించారు.... 6లో



అమలాపురం ఓంశాంతి నిలయంలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



రాయవరంలో...

'సభా' సందడి!

అందరూ ఎదురుచూస్తున్న అసెంబ్లీ కొలువుదీరింది. తొలి సభలో శాసనసభ్యుల ప్రమాణ స్వీకారాలు నిర్వహించారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సమక్షంలో ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారాలు చేయగా, సభ అంతా సందడి నెలకొంది. ఎవరు ఎలా ప్రమాణ స్వీకారం చేస్తారోనని అందరూ ఆసక్తిగా గమనించారు. అలాగే శాసన సభలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను కలవడానికి కూటమి ఎమ్మెల్యేలంతా పోటీపడ్డారు. సభలో కనిపించిన దృశ్యాలివి..

- తొలిరోజు ప్రమాణ స్వీకారోత్సవ సంబరం
- ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్ గోరంట్ల
- చంద్రబాబు, పవన్, లోకేశ్‌లను కలిసేందుకు ఉత్సాహం





శాసనసభలో చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ



పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు పవన్‌కల్యాణ్, కందుల దుర్గేష్, నిమ్మకాయల చినరాజప్ప



శాసనసభలో తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులైన ఎమ్మెల్యేలు మిరియాల శిరీషాదేవి, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, దేవ వరప్రసాద్, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ తదితరులు

వేట్లపాలెంలో డయేరియా బాధితులు

- విరేచనాలతో 13 మందికి చికిత్స
- కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి ముగ్గురు తరలింపు
- మరో పది మందికి పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స



వైద్య బృందంతో పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్

సామర్లకోట, జూన్ 21: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శుక్రవారం పలువురు విరేచనాలతో డయేరియా బారినపడి అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో జొన్నల దొడ్డి ప్రాంతంలో సుమారు 13 మంది విరేచనాలకు గురికాగా, వారిలో ముగ్గురికి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు అంబులెన్స్‌లలో తరలించారు. ఏడుగురికి వేట్లపాలెం పీహెచ్‌సీలో వైద్యులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ పరదేశి ఆద్వర్యంలో వైద్యం అందిస్తున్నారు. మరో పదిమంది విరేచనాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరినట్టు కుటుంబవర్గాల ద్వారా తెలిసింది. కాగా గ్రామంలో పలువురికి విరేచనాలతో డయేరియా బారినపడి అస్వస్థతకు గురైన సంఘటనపై అధికారులు ఉలిక్కిపడ్డారు. హుటాహుటిన వేల్లపాలెం వైద్యబృందం జొన్నలదొడ్డి ప్రాంతంతోపాటు గ్రామంలో ఇంటింటా పర్యటించి కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. విరేచనాలు వంటి లక్షణాలు కలిగిన పలువురిని గుర్తించి టాబ్లెట్‌లను అందించారు. అలాగే గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలిందన్న సమాచారంతో సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవో పీఆర్డీ హరికృష్ణసత్యారెడ్డి తదితర పంచాయతీ సిబ్బంది గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌లను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకులను గుర్తించి అరికట్టాలని సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. కాగా గ్రామంలో డయేరియా ఏవిధంగా ప్రబలింది, ఆహారం విషయంలో ప్రజలు ఏమేమి జాగ్రత్తలు తీసుకున్నారనే అంశాలపై ఎంపీడీవో శ్యామ్ సుందర్ ఆరా తీశారు. జిల్లా వైద్యఆరోగ్య ఉన్నతాధికారులు ఇచ్చిన ప్రత్యేక ఆదేశాల మేరకు గ్రామంలో డయేరియా అదుపులోకి వచ్చేవరకూ వైద్యఆరోగ్య సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కాగా రాజధాని అమరావతి సచివాలయంలో శుక్రవారం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఉన్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వేట్లపాలెం గ్రామంలో పలువురు డయేరియా బారిన పడినట్లు సమాచారం తెలిసి సత్వరం స్పందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులకు రాజధాని నుంచి ఫోన్ చేసి సమాచారాన్ని సేకరించారు. పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

డయేరియా బారినపడినవారు వీరే..

కొమ్మోజు సత్యవేణి, పరిమి స్రవంతి, పైలా అక్షయ్‌లను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాలకుర్తి జ్యోతి, బిక్కిన భవాని, వడ్డాది పెద్దరాజు, వడ్డాది అప్పారావు, బంగారు హరిచరణ్, పరిమి దివ్య, వడ్డాది వెంక టచరణ్, వడ్డాది రామయ్య, బడ్డేటి వెంకటేష్, బడేటి సుభాష్, వడ్డాది గన్నివర్ధన్, అభిషేక్, మానస, మనుపర్తి వేగేశ్వరరావు చికిత్స పొందుతున్నారు.

బెండపూడిలో ఏడు డయేరియా కేసుల నమోదు

తొండంగి, జూన్ 21: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి గ్రామంలో శుక్రవారం ఏడు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీటిలో నాలుగు కేసులకు స్థానికంగా చికిత్స అందించి మిగిలిన మూడు కేసులను కాకినాడ రిఫర్ చేశారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత ఈ కేంద్రాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు. మరోవైపు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



రాయవరంలో అవయవ దానంపై రూపొందించిన ప్రాజెక్టు

అగ్గిపుల్లలతో అవయవదానంపై ప్రాజెక్టు

ఆకట్టుకున్న రాయవరం విద్యార్థినుల ప్రతిభ

రాయవరం, జూన్ 21: అవయవ దానం మహాదానం అంటూ అవగాహన కల్పిస్తూ రాయవరం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు 1 లక్షా 50వేల 330 అగ్గిపుల్లలతో చేసిన కొలాజ్ ఆర్ట్ ద్వారా తయారు ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాయవరం గ్రామంలో నివాసం ఉంటున్న మల్లిడి స్వర్ణలత మండపేట ఆదిత్య కాలేజ్‌లో ఇంటర్ చదువుతోంది. ఆమె సోదరి వైష్ణవి రాయవరం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. అనపర్తి మండలం రామవరం హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మందపల్లి సత్యానందం ఆధ్వర్యంలో స్వర్ణలత, వైష్ణవి 1లక్షా 50వేల 330 అగ్గిపుల్లలతో సుమారు 2వేల 700 అగ్గిపెట్టెలు ఉపయోగించి 30 రోజులపాటు శ్రమించి మానవ శరీరంలో ఉండే ముఖ్యమైన అవయవాలను కొలాజ్ ఆర్ట్ ద్వారా 15 అడుగుల పొడవు, 13 అడుగుల వెడల్పుతో ప్రాజెక్టును తయారుచేశారు. వరల్డ్ రికార్డు తమ ప్రాజెక్టు పంపనున్నట్టు విద్యార్థినులు తెలిపారు. ఈ ప్రాజెక్టును రామచంద్రపురం డీవైఈవో నరసింహపాణి, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణ మూర్తి, వై.సూర్యనారాయణ సందర్శించారు. ప్రాజెక్టు తయారుచేసిన విద్యార్థినిలను, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సత్యానందంను డీవైఈవో, ఎంఈవోలు, హెచ్‌ఎం శాంతి సునీత అభినందించారు.




యోగాసనం వేసిన పీడీజే గంధం సునీత తదితరులు.. సెంట్రల్ జైలులో యోగాసనాలు వేసిన అధికారులు, ఖైదీలు

జీవన శైలిలో యోగా భాగం కావాలి

రాజమహేంద్రవరంలో పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మన జీవన శైలిలో యోగాను ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని, శారీరక మానసిక శ్రేయస్సును మెరుగుపరిచే ఒక అభ్యాసం యోగా అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని యోగాసనాలను వేశారు. యోగాలో పాటించాల్సిన పద్ధతులు, మెలకువలను యోగా శిక్షకుడు శ్యామ్ వివరించారు. అలాగే సెంట్రల్ జైలులో అధికారులు, ఖైదీలు యోగాసనాలు వేశారు. ప్రతి రోజూ ఉదయం ఖైదీలు యోగాతో తమ దైనందిన జీవనాన్ని ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. యోగా భారతి ట్రస్టు గురువులు అల్లు సత్యనారాయణ, నవీన.. యోగ, ధ్యానం చేయించిన అనంతరం అష్టాంగ యోగా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.రాజ్‌కుమార్, బి.రత్నరాజు, జైలర్లు కెవీ రామారావు, ఆర్.శ్రీనివాసులు, కె.దుర్గారమేశ్, సీహెచ్ రమేశ్‌లు పాల్గొన్నారు.




హతమార్చిన రక్తపింజర పాము.. మహిళ మృతదేహం

పాముకాటుకు మహిళ మృతి

మామిడికుదురు, జూన్21: మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవకు చెందిన వనమాడి అంజలీదేవి (38) పాముకాటుకు గురై మృతిచెందినట్టు నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు అంజలీదేవి గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో తన ఇంటి వద్ద వాకిలి తుడుచుకుంటుండగా రక్తపింజర పాము కాటువేసింది. స్థానికులు పామును హతమార్చి, పాముకాటుకు గురైన మహిళను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఏజెన్సీలో పాముకాటుకు వ్యక్తి మృతి



పాముకాటుకు మృతి చెందిన బాబూరావు

రాజవొమ్మంగి జూన్ 21: రాజవొమ్మంగి గ్రామంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పాతాళ బాబూరావు (45) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి పాముకాటుకు గురై మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబూరావు శుక్రవారం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పొలంగట్టుపై పాము కాటువేయడంతో హుటాహుటీన ఇంటికి చేరుకున్నాడు. కుటుంబీకులు రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాబూరావు మృతి చెందాడని వైద్యాధికారి సుష్మ వెల్లడించారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు.

రైలు పట్టాలపై ఆడ శిశువు మృతదేహం



నిడదవోలు, జూన్21: పుట్టి పదిహేను రోజులైనా నిండని శిశువు మృతదేహం అనుమానాస్పదంగా రైలు పట్టాలపై ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఎవరైనా కఠినాత్ములు ఆడపిల్ల పుట్టిందని రైలు పట్టాలపై వదిలేశారా లేక చనిపోయిన ఆడ శిశువును తెచ్చి పట్టాలపై వదిలేశారా అనేది చర్చనీయాంశమైంది. నిడదవోలులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న యార్డ్ వద్ద శుక్రవారం రైలు పట్టాలపై పదిహేను రోజులలోపు వయసున్న గుర్తుతెలియని ఆడశిశువు మృతదేహాన్ని అనుమానాస్పద స్థితిలో జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు గుర్తించారు. మృత శిశువును పసుపు తెలుపు బొమ్మల డిజైన్ ఉన్న బేబీ కేరింగ్ కవర్‌లో ఉంచారని ఎరుపురంగు చున్నీ చుట్టూ చుట్టి ఉందని, పింక్ కలర్ జుబ్బా వేసి ఉందని చెప్పారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతశిశువును గుర్తించినవారు 9490617090, 7013360296 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆలమూరు, జూన్ 21: మండలంలోని చెముడులంక 216 (ఎ) జాతీయ రహదారిపై ధనలక్ష్మమ్మ ఆలయం ఎదురుగా గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గళ్లా సుబ్బారావు (56) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుబ్బారావు రైతువారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పట్లాగే పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో చెముడులంక కూడలి వద్ద ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

25న గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ ఈనెల 25న జరుగుతుందని జిల్లా సమన్వయకర్త వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27న ప్రవేశ పరీక్షలు సంబంధిత పాఠశాలలో జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు చేరాలనుకునే పాఠశాలకు వెళ్లి దరఖాస్తు చేయాలన్నారు. ప్రధానంగా 6 తరగతి నుంచి 9 తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ షెడ్యూల్ ప్రకారమే అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లాలో ప్రవేశాలు జరుగుతాయని సమన్వయకర్త వెంకటరావు తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ సీజ్

కాజులూరు మండలంలో విజిలెన్స్ దాడులు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్నారనే సమాచారంతో రాజమండ్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం కోలంక గ్రామ సమీపంలో టాటా వాహనం తనిఖీ చేయగా అక్రమంగా డీజిల్ తరలిస్తున్నట్టు గుర్తించారు. 16 డ్రమ్ముల్లో 3200 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నారు. వాహన యజమాని జొజ్జవరపు శ్రీనివాస్ ఆదేశాల మేరకు డ్రైవర్ కోరుకొండ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఈ డీజిల్ విలువ రూ.12,68,800 ఉంటుందని పేర్కొన్నారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌కు సిఫారసు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పెట్రోల్ ఉత్పత్తుల అక్రమ నిల్వలపై దాడులు జరుగుతున్నాయి. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, కిషోర్, శివ, లక్ష్మీప్రసన్న, రెవెన్యూ సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.



సప్త నదీ జలాలకు అర్చకుల పూజలు

అంతర్వేదిలో ఘనంగా సప్తనదీ జ్యేష్ఠాభిషేక మహోత్సవం

వైభవంగా మహాశాంతి హోమం

అంతర్వేది, జూన్21: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠా నక్షత్ర పర్వదినం సందర్భంగా శ్రీస్వామివారి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. తొలుత అర్చకులు శిరస్సుపై సప్తనదీ జలాలు ఉంచుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామివారికి తొలుత పంచామృతాభిషేకం నిర్వహించి, సప్తనదులైన గంగా, యమునా, సరస్వతి, నర్మదా, గోదావరి, సింధు, కావేరి పవిత్ర గోదావరి జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్య, సహ అర్చకులు, వేదపండితులచే అత్యంత వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షారాధన, చతుర్దశ కలశారాధన, నవకలశారాధన, పంచామృత కలశారాధన, సప్తనదీ కలశ ఆవాహనులు, ఆరాధనలు, విశేష అర్చనలు, అగ్నిమధనం, అగ్నిహోత్రాలతో ప్రత్యేక పూజల అనంతరం సప్త నదీజలాలతో, చతుర్దశ కలశాలతోను స్వామివారి మూలవరులకు మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశాంతి హోమం వైభవంగా నిర్వహించి పూర్ణాహుతిలో భాగంగా పూజా ద్రవ్యాలను హోమంలో వేసి పూజా కార్యక్రమాలు పూర్తిచేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, జలాభిషేక ద్రవ్యాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారామగోపాలరాజా బహదూర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, పోతురాజు శ్రీవెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పూర్ణాహుతి ద్రవ్యాలు సమర్పిస్తున్న అర్చకులు, అధికారులు

హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అమలాపురం టౌన్, జూన్ 21: ఆర్టీసీ అమలాపురం డిపోలో హెవీ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మేనేజరు సీహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. 9వ బ్యాచ్ శిక్షణ తరగతులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. 21 ఏళ్లు నిండి లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి డ్రైవింగ్‌లో ఏడాదిపాటు అనుభవం ఉన్నవారు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎండీ రజాక్‌ను 7382909588లో సంప్రదించాలని కోరారు.



అమలాపురంలో యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్న రెండో అదనపు జిల్లా జడ్జి నరేష్


అంతర్జాతీయ యోగా గురువు భైరవస్వామిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు



కలెక్టర్ శుక్లాకు యోగా పత్రాన్ని అందజేస్తున్న బీకే శ్రీదేవి


మలికిపురం: యోగాసనాలను వేయిస్తున్న యోగా గురువు


ద్రాక్షారామ: : యోగా చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

సర్వరోగ నివారిణి యోగా

● జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ● అంతర్జాతీయ యోగా దినోత్సవం

అమలాపురం టౌన్, జూన్ 21: యోగాసనాలు సర్వరోగ నివారిణిగా పని చేస్తాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి యోగా ఉపకరిస్తుందన్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఎన్నో యోగాతో ముడిపడి ఉన్నాయని వివరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం ఓం శాంతి నిలయంలో బ్రహ్మకుమారీల సౌజన్యంతో జిల్లా స్థాయిలో యోగా దినోత్సవ వేడుకలను విద్యార్థులు, అధికారులతో కలిసి నిర్వహించారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు యోగాసనాలు వేశారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను అలవాటుగా చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలన్నదే యోగా దినోత్సవ లక్ష్యమన్నారు. మానసిక ప్రశాంతతో పాటు ఏకాగ్రత సాధించేందుకు యోగా దోహదపడుతుందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో ఉండే కాల్షియం తగ్గుతుందని,తద్వారా ఎముకలు బలహీనమవుతాయని, ఈ పరిస్థితుల్లో యోగాసనాలు వేయడం వల్ల ఎముకలు శక్తివంతమవుతాయన్నారు. కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.చంటిబాబు, జిల్లా స్పోర్ట్స్ డెవలెప్‌మెంట్ అధికారి పీఎస్ సురేష్‌కుమార్, వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్, ఓం శాంతి కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి, బీకే స్వరూప తదితరులు పాల్గొన్నారు. అమలాపురం బార్ అసోసియేషన్ ప్రాంగణంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో రెండో అదనపుజిల్లా జడ్జివి.నరేష్‌తో పాటు సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి, సివిల్ జడ్జి కె.సాయికుమారి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, అడిషనల్ సివిల్ జడ్జి ఎ.హిమబిందు, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పీవీ ప్రసాదరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయి, న్యాయవాదులు పాల్గొన్నారు. ఓంశాంతి కేంద్రం ప్రతినిధులు బీకే రాజేశ్వరి, బీకే కీర్తి రాజయోగ మెడిటేషన్ విశిష్టతలను వివరించి యోగాసనాలు వేయించారు. జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు జీవీకే సుమంత్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ యోగా పూర్వీకులు ప్రపంచానికి అందించిన గొప్ప విజ్ఞానమని వివరించారు. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకుయోగాసనాలు వేయాలన్నారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా గురువుకు సత్కారం

అమలాపురం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, అంతర్జాతీయ యోగా గురువు మోటూరి భైరవస్వామిని ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, ఎలక్ట్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు భైరవస్వామికి దుశ్శాలువాలు కప్పారు. కార్యదర్శి వలవల నాయుడు, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, పుత్సా కృష్ణకామేశ్వర్, తేతల సత్యనారాయణరెడ్డి, నూకల సత్యనారాయణ, యర్రమిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కామనగరువు ఆదిత్య స్కూలులో ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుధతో పాటు ఉపాధ్యాయులు యోగా విద్యార్థులను అభినందించారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో బ్రహ్మకుమారి స్వరూప ముఖ్య అతిథిగా హాజరై యోగా విశిష్టతను విద్యార్థులకు వివరించి యోగాసనాలు వేయించారు. పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, డిప్లొమా ప్రిన్సిపల్ ఫణిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంసీఎస్ మధన్, కోఆర్డినేటర్ కె.దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

'యోగాతో మానసిక ప్రశాంతత'

రామచంద్రపురం(ద్రాక్షారామ): నిత్యంకేసులు ఒత్తిడితో సతమతమయ్యే న్యాయవాదులకు యోగాతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సమకూరుతుందని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనంలో జరిగింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ తదితరులు మాట్లాడారు. యోగా మాస్టర్, న్యాయవాది గాడేపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగ క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నిజం శారద, ఎజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావునాయక్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ. అరుణోదయకుమార్, పీడీ జంపని రఘురామ్ పాల్గొన్నారు. బీజేపీ, జనసేన నాయకులు కొట్టువాడ హరిబాబు, గొల్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

● అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శుక్రవారం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ కల్యాణమండపంలో జరిగాయి. డీఎస్పీ మాట్లాడుతూ యోగా ప్రాచీన భారతీయ జీవన విధానం అన్నారు. రామచంద్రపురం, మండపేట సీఐలు దొరరాజు, కొమ్ము శ్రీధర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది యోగాసనాలు వేశారు. వీఎస్ఎం కళాశాలలో యోగాదినోత్సవ వేడుకలు జరిగాయి. మోడరన్ విద్యా సంస్థల్లో జరిగిన యోగా దినోత్సవవేడుకల్లో యోగా శిక్షకుడు తొగరు మూర్తి పాల్గొని యోగా విశిష్టతను తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.కె.సి సత్యలత ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.


మానేపల్లి బాలుర హైస్కూల్లో యోగా చేస్తున్న విద్యార్థులు


ముమ్మిడివరం: యోగాసనాలు వేస్తున్న మహ్మద్ రహ్మతుల్లా

యోగాతో మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత

ముమ్మిడివరం: ప్రస్తుత యాంత్రిక యుగంలో మానిసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగా, మెడిటేషన్ ఎంతో ఉపయోగపడుతుందని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా గురువు వాసంశెట్టి నరేష్, జశ్విత, నిషిత, ధన్య, పవర్‌లిఫ్టర్స్ లవకుమార్, సత్యర, సాత్విక్‌వర్మ, ధర్మ, చందు, అవినాష్ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆలమూరు : జొన్నాడ జడ్పీ హైస్కూలు ఆవరణలో యోగా గురువు, విశ్రాంత ఉపాధ్యాయుడు ద్విభాష్యం శ్రీనివాస్ యోగా ప్రాముఖ్యతతో పాటు యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీ వద్ద సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ, తెలుగు మహిళ జిల్లా యోగా టీచర్ వేగిరాజు వెంకటసత్యప్రవీణ యోగా విశిష్టతను వివరించారు. ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల వీరవెంకటసత్యనారాయణ, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు యోగాసనాలు వేశారు.

'యోగా సాధనను అలవర్చుకోవాలి'

మండపేట: ప్రతి వ్యక్తి యోగాభ్యాసాన్ని జీవన విధానంగా అలవర్చుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ప్రశాంత జీవనం సాగించవచ్చునని యోగాభ్యాసకుడు పాతూరి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మండపేట అయ్యప్పస్వామి ఆలయంవద్ద ఉన్న యోగా సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగాచార్య కుసాల సత్యనారాయణ, యోగ ప్రశిక్షక్ అంకం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో యోగాపై అవగాహన, యోగాసనాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగా గురువు కడలి కృష్ణార్జునరావు విద్యార్థులకు వివిధ ఆసనాలు నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.సతీష్, శ్రీనివాసరాజు, నక్కా రమేష్ బాబు, విజయ్‌కుమార్, రాహేల్‌బాబు, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పడమటిపాలెం హైస్కూలులో యోగా గురువు శిరిగినీడి భైరవమూర్తిని యోగాడే సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో అడబాల నరసింహారావు, అడబాల రాంబాబు, మేడిచర్ల చాణుక్య తదితరులు పాల్గొన్నారు. పలు పాఠశాలల్లో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పి.గన్నవరం: మండలంలోని పి.గన్నవరం, మానేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సమగ్రశిక్ష జిల్లాస్థాయి సీఎంవో బీవీవీసుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారిణి కె.హెలీనా, ప్రధానోపాధ్యాయుడు డీఎస్‌కె ప్రసాద్, సీహెచ్‌వీ నందం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బోళ్ల భద్రం వ్యాయమ ఉపాధ్యాయులు రమణ, వైఎన్ సతీష్, ఎం.దుర్గాప్రసాద్, కె.సుభాషిణి, కె.భీమేంద్ర, సాయిరాం పాల్గొన్నారు.

మామిడికుదురు: మామిడికుదురు హైస్కూలు, దీప్తి స్కూలు, లూటుకుర్రు పీహెచ్‌సీలో ఈ వేడుకలు జరిగాయి. నగరం హైస్కూలులో యోగా గురువు చేతన్ ఆకుల, లూటుకుర్రులో కోట బ్రహ్మానందం యోగా ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులు, పీహెచ్‌సీ సిబ్బందిచే యోగాసనాలు వేయించారు. దీప్తి స్కూలులో కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ యోగా ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు వెలగల ఫణి కృష్ణారెడ్డి మాట్లాడుతూ యోగా, ధ్యానం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చిన్నతనం నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలకు యోగా నేర్పించాలన్నారు. రాయవరం హైస్కూల్, భాష్యం స్కూల్, సాయితేజా స్కూల్‌లో యోగా డే నిర్వహించారు. వెదురుపాకలో యానిమేటర్ల సంఘం నాయకురాలు ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. భాష్యం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా, ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, హిందీ అధ్యాపకుడు ద్వారంపూడి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని మాజీ ఏఎంసీ చైర్మన్ అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. అలాగే మాచవరం బెహరవారి అగ్రహారంలో జరిగిన యోగాదినోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిలు పాల్గొనారు. తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు యోగా ఆసనాలను వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పీవీ కేశవచార్యులు, పీడీ పి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో మోరి, అంతర్వేది హైస్కూలులో యోగా గురువు విద్యార్థులకు యోగాసనాలు నేర్పించి యోగా దినోత్సవ వేడుకలను జరిపించారు. కేశవదాసుపాలెంలో యోగా డేను పురస్కరించుకుని అమృత్ సరోవర్ గ్రామ పంచాయతీ చెరువు వద్ద ఉపాధి కూలీలతో పాటు గ్రామస్తులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు యోగాసనాల్లో పాల్గొన్నారు. ఏపీవో నాగప్రసాద్, జేఈ శ్రీనివాస్, పీఏ టెక్నికల్ అసిస్టెంట్ అనూష, ఉండపల్లి అంజి, యోగా గురువు మన్నె సత్యనారాయణ, హెచ్ఎం పడాల సోమసూర్యకుమారి, పీడీ కె.భాస్కర్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఎస్.యానాం ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణాధికారి విప్పర్తి వరప్రసాదరావు ఆధ్వర్యంలో యోగాసనాలపై ప్రయోగాత్మక కార్యక్రమం జరిగింది. జిల్లా అదనపు వైద్యాధికారిణి భరతలక్ష్మి, వైద్యాధికారిణి లోవసుధ, వేదాంత సీఎస్ఆర్ మేనేజరు పాషా పాల్గొన్నారు. గొల్లవిల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో హెచ్ఎంలు లంక రాణి, నూకల సత్యనారాయణ, పీడీలు గొలకోటి ఫణీంద్రకుమార్, కామన మధు, పీహెచ్ఎన్ మాణిక్యం, హెచ్‌వీ విజయకుమారి, రాధాకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగావల్ల కలిగే సత్ఫలితాలను వివరించారు.

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం యోగా దినోత్సవం జరిగింది. స్థానిక వివేకానంద కేంద్రకన్యాకుమారి కార్యస్థాన్, కళాశాల ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో యోగా నిపుణులు గండికోట శ్రీనివాస్, కార్తీక్, కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.రత్నాకరరాజు, శ్రీసందీప్, ఎస్.జయలక్ష్మి పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మోదీ ప్రవేశపెట్టిన యోగా దినోత్సవాన్ని బీజేపీ రాష్ట్ర జిల్లా నాయకత్వ ఆదేశానుసారం నిర్వహించామని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బి.సాయిబాబు, జె.శాంతకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక సీఆర్సీలో స్వామి వివేకాశ్రమం గురువు ఆకుల శ్రీనివాస్ యోగాసనాలు వేయించారు. యోగా విశిష్టతను వివరించారు. సీఆర్సీ యోగా డైరెక్టర్ మోటూరిప్రకాశరావు, యోగా గురువు కర్రి సత్తిరెడ్డి, మన్యం వర్ధనరావు పాల్గొన్నారు. ఈతకోట జడ్పీ హైస్కూలులో యోగా దినోత్సవంలో బీజేపీ కన్వీనర్ గంద్రోతు వీర గోవిందరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాసు ముఖ్య అతిథులు పాల్గొని యోగాభ్యసనంవల్ల ప్రయోజనాలను వివరించారు.

కొత్తపేట: కొత్తపేట కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి, సిబ్బందితో న్యాయవాది సి.విజయ యోగాసనాలు వేయించారు. విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కేపీ రాజు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. హైస్కూలు ప్రాంగణంలో ఆర్ఎస్ఎస్ బసవరాజు, తురగా ఆంజనేయులు ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావు, మాధవస్వామి, యిళ్ల సత్యనారాయణ, శివ పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఉచ్చిలి పాఠశాల విద్యార్థులకు ఎంఈవో వరప్రసాదరావు యోగా వల్ల కలిగేప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు.

యానాం: పుదుచ్చేరి ఆరోగ్య పర్యాటకశాఖ యోగా మెడిటేషన్ సొసైటీ సంయుక్త నిర్వహణలో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానం ఆవరణలో గల ఇండోర్ స్టేడియంలో యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖర్, ఆరోగ్యశాఖ డీడీ రవిశంకర్, పురుషోత్తం తదితరులు జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యోగా ఇన్‌స్ట్రక్టర్స్ సంద్యాల దుర్గారావు, ముమ్మిడి ఆనంద్(నందు), సంధ్యలు యోగాసనాలు వేసి అతిథులకు, విద్యార్థులకు వివరించారు.

'అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి'

అమలాపురం టౌన్, జూన్ 21: జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేయాలని కోరుతూ ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకురాలు (ఆర్జేడీ) డాక్టర్ ఎస్.శోభారాణికి పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలకు విచ్చేసిన ఆర్జేడీని కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవశ్యకతను వివరించారు. గతంలో ఎస్‌కేబీఆర్ కళాశాల ఎయిడెడ్‌గా ఉండేదని, గత ప్రభుత్వం ఎయిడెడ్ వ్యవస్థను రద్దు చేయడంతో ప్రైవేటు కళాశాలగా మారిపోయిందన్నారు. దాంతో పేద విద్యార్థులు వేలాది రూపాయల ఫీజులు కట్టలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని వివరించారు. ఎస్‌కేబీఆర్ కళాశాలను నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మార్చాలని వినతిపత్రంలో కోరారు. కామన్‌మెన్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాశి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.67 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 21: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.1,67,836లభించినట్టు డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అన్నప్రసాద ట్రస్టుకు విరాళాలు అందజేశారు.

ఘనంగా స్వామివారి చక్రస్నానం

ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయ క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం పూర్ణాహుతి, పవిత్ర నదిలో స్వామివారి చక్రస్నాన మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈవో కృష్ణచైతన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్టూడెంట్ కిట్స్‌ను తనిఖీ చేసిన డీవైఈవో

రాయవరం, జూన్ 21: రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్ స్టాక్ పాయింట్‌ను శుక్రవారం రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద నరసింహపాణి తనిఖీ చేశారు. కిట్స్‌ను విద్యార్థులకు విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో మరింత రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, హెచ్ఎం విశాంతి సునీత తదితరులు పాల్గొన్నారు.

శివాజీ శౌర్య స్ఫూర్తి పోటీలు

అమలాపురం టౌన్, జూన్ 21: ఛత్రపతి శివాజీ మహారాజ్ 350వ సామ్రాజ్య పట్టాభిషేక సంవత్సరాన్ని పురస్కరించుకుని సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శివాజీ శౌర్య స్ఫూర్తి పోటీలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ గోదశి గంగరాజు తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంజనీరింగ్ విద్యార్థుల వరకు శివాజీ జీవిత చరిత్ర ఆధారంగా వ్యాసరచన, చిత్రలేఖనం, ఏకపాత్రాభినయం, లఘునాటిక పోటీలు నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఈ పోటీలు జరుగుతాయి. తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన వారిని మండల స్థాయి పోటీలకు, ఆ తర్వాత మండల స్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలిచిన విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు, డివిజన్ స్థాయిలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని సంస్కారభారతి జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆకొండి పవన్, పుత్సా కృష్ణకామేశ్వర్ తెలిపారు.శౌర్య స్ఫూర్తి పోటీల పోస్టర్లను డాక్టర్ గంగరాజు, డాక్టర్ కొప్పినీడి వెంకటరమణకుమార్‌శుక్రవారం ఆవిష్కరించా రు. సంస్కారభారతి ప్రాంత ప్రముఖ్ వేదనభట్ల సాయిలక్ష్మి, శ్రీగిరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. జూలై 5వ తేదీలోగా పాఠశాల, కళాశాల స్థాయి పోటీలు పూర్తి చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9885450524లో సంప్రదించాలన్నారు.

గోడి గురుకులలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

అల్లవరం, జూన్ 21: గోడి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన ఖాళీల భర్తీకి జూన్ 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా సమన్వయకర్త జి.వెంకట్రావు, ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా గురుకులాల్లో దరఖాస్తు చేసుకుని ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. ఖాళీల వివరాలకు గురుకుల కళాశాలను సంప్రదించాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి: ఈవోపీఆర్డీ

ఉప్పలగుప్తం, జూన్ 21: గ్రామాల్లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి సూచించారు. శుక్రవారం ఆమె గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. వర్షాకాలం కారణంగా చెత్త నిల్వ ఉంటే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా కార్యక్రమం రూపొందించుకోవాలన్నారు. భీమనపల్లిలో వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టును పరిశీలించారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే బండారు


ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జూన్ 21: కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు డీజీపీ ద్వారకా తిరుమలరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువా కప్పి మెమెంటో అందించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను, మంత్రులు వాసంశెట్టి సుభాష్, జనార్దనరెడ్డి, కందుల దుర్గేష్‌లను కలిసి అభినందనలు తెలిపారు.

ఉపాధి కూలీ మృతి

అమలాపురంటౌన్, జూన్ 21: తాండవపల్లి మన్నా నగర్ కాలనీకి చెందిన కందికట్ల పల్లంరాజు శుక్రవారం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పని పూర్తయిన కొద్దిసేపటికే ఆకస్మికంగా అదే ప్రాంతంలో మృతి చెందాడు. పల్లంరాజు మృతదేహాన్ని స్థానికులతో కలిసి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు పరిశీలించి అధికారులకు సమాచారం అందించారు. పల్లంరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండు చేశారు.

వినియోగదారుల జేఏసీ సభ్యుడిగా ఆదిత్యకిరణ్

కొత్తపేట, జూన్ 21: ఢిల్లీలో జరిగిన జాతీయ వినియోగదారుల సమావేశంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల వినియోగదారుల జేఏసీ ఏర్పాటు చేశారు. కొత్తపేటకు చెందిన సత్తిరాజు ఆదిత్యకిరణ్‌ను కోనసీమ జిల్లా వినియోగదారుల జేఏసీ సభ్యునిగా నియమించారు. కిరణ్‌కు టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, దర్నాల రామకృష్ణ, బాబ్జి, మూర్తి అభినందనలు తెలిపారు.

విద్యాప్రవేశ్‌ను సమర్థవంతంగా అమలుచేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 21: ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి విద్యార్థుల్లో పూర్వ ప్రాథమిక విద్యను పరిచయం చేసే విద్యాప్రవేశ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సమగ్ర శిక్షాభియాన్ ఏఎంవో పి.రాంబాబు కోరారు. శుక్రవారం రామచంద్రపురం పట్టణంలో ఇందిరాగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఏఎంవో రాంబాబు తనిఖీ చేశారు.

టీడీపీ, జనసేన కూటమి విజయోత్సవ సంబరాలు

అల్లవరం, జూన్ 21: ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్, ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం సందర్భంగా శుక్రవారం సంబరాలు నిర్వహించారు. జనసేన సీనియర్ నాయకుడు కంకిపాటి గోపి ఆధ్వర్యంలో అల్లవరంలో, టీడీపీ కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు ఆధ్వర్యంలో బాణసంచా కాల్పుల నడుమ కేక్‌లు కట్ చేశారు. ఎన్టీఆర్, వంగవీటి రంగా, కంకిపాటి వీరబాబు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బండిగుప్తాపు సత్తిబాబు,మంతెన సురేష్‌రాజు, ఆకుల లక్ష్మణరావు, వేగిరాజు వెంకట్రాజు, జంగా బుజ్జి, దాట్ల గోపీరాజు, చికిలే చిట్టిబాబు, సుంకర సాయి, బి.కృష్ణ, పోతుల నాగరాజు, వేగిరాజు సుబ్బరాజు, ఎన్.మౌనిక, కంకిపాటి చినవీరబాబు, రాసూరి రాంబాబు, గెద్దాడ శ్రీను, మండా రాంబాబు, బాబి పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల

రాజోలు, జూన్ 21: రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని అమలాపురం ఎంపీగా గంటి హరీష్‌మాధుర్ విజయం సాధించాలని రాజోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో నెగ్గాలని రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు పొన్నమండకు చెందిన గుబ్బల శ్రీనివాస్ పొన్నమండల శివాలయంలో హోమం నిర్వహిస్తామని మొక్కుకున్నారు. పొన్నమండ శివాలయంలో శ్రీనివాస్, భవానీచంద్ర దంపతులు వేద పండితులచే హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కడలి అబ్బు, దాకే ఏడుకొండలు, కడలి మోహన్, కాండ్రేగుల మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు పలువురి అభినందనలు


సుభాష్‌కు అభినందనలు తెలుపుతున్న బండారు శ్రీనివాస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 21: కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శుక్రవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ నాయకులు గుత్తుల సాయి, కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌కలిసి అభినందనలు తెలిపారు.

మంత్రి సుభాష్‌కు కూటమినేతల అభినందనలు


అంబాజీపేట, జూన్ 21: రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అంబాజీపేట కూటమి నేతలు అభినందనలు తెలిపారు. రామచంద్రపురం అసెంబ్లీ అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా నియమితులైన సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, రవణం రాము, దొమ్మేటి రామారావులు పాల్గొన్నారు.


మంత్రి సుభాష్‌కు అభినందనలు తెలుపుతున్న కూటమి నేతలు

ఆర్ఎంపీ వైద్యుడిపై దాడి

ముమ్మిడివరం, జూన్ 21: భూ వివాదాల నేపథ్యంలో ఆర్ఎంపీ వైద్యుడు, టీడీపీ కార్యకర్త దొంగ సత్యనారాయణపై వైసీపీ కార్యకర్త దాడిచేసి గాయపరిచిన సంఘటన ఇది. ముమ్మిడివరం మండలం కొమానపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తకాల్వకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు దొంగ సత్యనారాయణకు అదే గ్రామానికి చెందిన కొప్పిశెట్టి వెంకటేష్ (బాబి)కి మధ్య భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారంరాత్రి సత్యనారాయణ ఇంటికి తిరిగి వెళుతుండగా పంటకాల్వ సమీపంలో కొప్పిశెట్టి వెంకటేష్, మరికొంతమంది దారికాసి ఇనుప రాడ్లతో దాడి చేయగా సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. వారు తనపై దాడి చేస్తుండగా తప్పించుకుని పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నట్టు సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు.

ప్రముఖ పండ్ల వ్యాపారి మృతి


చిట్లాల శ్రీనివాసరావు

మలికిపురం, జూన్ 21: మలికిపురం సెంటర్‌లో సుదీర్ఘ కాలం నుంచి పండ్లు, పూల వ్యాపారం చేస్తున్న చిట్లా శ్రీనివాసరావు (58) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా పండ్లు, పూల వ్యాపారులు సంతాప సూచకంగా తమ వ్యాపారాలు బంద్ చేశారు. శ్రీనివాసరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు మృతికి రాజోలు జనసేన, తెలుగుదేశం, బీజేపీ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, మాజీ ఎంపీపీ గంగాభవానీ, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మీ తులసీభాస్కర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీ జనార్దనస్వామి చక్రస్నానం

కపిలేశ్వరపురం, జూన్ 21: మండలకేంద్రమైన కపిలేశ్వరపురంలో ఉన్న శ్రీజనార్దనస్వామి వారి చక్రస్నానం ఘనంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాజాభజంత్రీల నడుమ స్వామివారిని పల్లకీలో ఊరేగుతూ స్థానిక గౌతమీగోదావరి నదిలో వేదపండితులు జనార్దనస్వామికి చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా బలుసులమ్మ తీర్థం

రాయవరం, జూన్ 21: రాయవరం గ్రామస్థుల ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి తీర్థం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమారు 200 సంవత్సరాల క్రితం అమ్మవారి గ్రామంలో వెలసినట్టు గ్రామస్థులు చెబుతారు. జేష్ఠమాసంలో వచ్చే పౌర్ణమిరోజున అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు హారతులు నిర్వహించగా భక్తులు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నైవేద్యం సమర్పించి తమకు పాడి పంటలు ఆయుఃఆరోగ్యం కలగాలని కోరుకుంటూ అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

కామిశెట్టి సావిత్రికి ఘన నివాళి

యానాం, జూన్ 21: స్వాతంత్ర్య సమరయోధురాలు, పుదుచ్చేరి తొలి మహిళా ఎమ్మెల్యే, మేయర్ కామిశెట్టి సావిత్రికి శుక్రవారం ఆదివారం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆమె జయంతి సందర్భంగా ఫెర్రి రోడ్డులోని ఆమె విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖర్, కామిశెట్టి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యానాం సమాచారశాఖాధికారి కెఎల్‌వి ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి'

ముమ్మిడివరం, జూన్ 21: నీటి ద్వారా సంక్రమించు వ్యాధులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు సూచించారు. ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు అధ్యక్షతన శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీరు సరఫరాకు సంబంధించి వాటరు ట్యాంకులను ప్రతీ 15 రోజులకొకసారి శుభ్రంచేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించడం ద్వారా తాగునీరు ద్వారా ప్రజలకు వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చునన్నారు. పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్‌డబ్ల్యుఎస్ జేఏఈ నానాజీరావు, ఎలక్ట్రికల్ ఏఈ శివాజీ, మండల పరిషత్ పరిపాలనాధికారి ఏఎస్ శ్రీనివాస్, విస్తరణాధికారిణి లక్ష్మీకల్యాణి పాల్గొన్నారు.

యానాం పెండింగ్ అంశాలపై సీఎం సమీక్ష

యానాం, జూన్ 21: యానాంకు సంబంధించి గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలపై పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఏప్రిల్ 6న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి పలు పెండింగ్ అంశాలపై యానాంలోని వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులతో పుదుచ్చేరి సీఎంను కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో యానాం నుంచి పూర్తిసహకారం అందాలంటే పెండింగ్ సమస్యలు పరిష్కారించాలని మల్లాడి వినతి పత్రం అందజేశారు. సీఎం నేతృత్వంలో జరిగిన సమీక్షాలో హోంమంత్రి నమశ్శివాయఃతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర శాఖల కార్యదర్శులు, డైరెక్టర్లు పాల్గొన్నారు. మధ్యాహ్నం 1గంట నుంచి 3గంటల వరకు యానాం అంశాలపైనే సమీక్ష జరిగింది. త్వరలో యానాంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కారం కానున్నాయని మల్లాడి వివరించారు.

పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్ ప్రారంభం

రాజోలు, జూన్ 21: బి.సావరంలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల బీవీపీ గ్రౌండ్ ఫ్లోర్ నాడు-నేడు నిధులు రూ.11లక్షలతో నూతనంగా నిర్మించారు. ఈ పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్‌ను రాజోలు ఎంపీపీ కేతా శ్రీను శుక్రవారం ప్రారంభించారు. పీఎంసీ చైర్‌పర్సన్ బొడ్డపల్లి దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈవోలు ఎస్.మనోహరం, ప్రసాదరావు, సర్పంచ్ కడియం రమాదేవి, స్థలదాతలు బొడ్డపల్లి కాశీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.వంశీ, సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, చిన్నారి, నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసీపీ ఓటమికి బాధ్యత వహిస్తూ ఏఎంసీ చైర్మన్ రాజీనామా

రాజోలు, జూన్ 21: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజోలు ఏఎంసీ చైర్‌పర్సన్ పదవికి గుబ్బల రోజారమణి శుక్రవారం రాజీనామా చేశారు. చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్మన్ సుంకర వెంకటసత్యప్రసాద్ కూడా రాజీనామా చేసిన పత్రాలను తాటిపాక మార్కెట్ యార్డు కార్యాలయంలో తనకు అందజేశారని కార్యదర్శి జీవీవీఎస్ శెట్టి తెలిపారు.

'పాడి రైతుల సంక్షేమానికి హెరిటేజ్ కృషి'

కె.గంగవరం, జూన్ 21: పాడిరైతుల సంక్షేమానికి హెరిటేజ్ డెయిరీ విశేష కృషి చేస్తుందని సంస్థ విజయవాడ రీజనల్ జీఎం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అముజూరు గ్రామంలో ఆయన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల సంరక్షణకు సంస్థ నుంచి చేస్తున్న పనులు వివరించారు. పశువులకు ఇన్సూరెన్స్, సబ్సిడీపై పశువుల దాణా, రైతులకు ఉచిత ఇన్సూరెన్స్ వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతి నిధులు అనూష, సుబ్బారావు, ఏజెంట్ గిరి, రైతులు పాల్గొన్నారు.